వినతిపత్రం అందిస్తున్న మున్సిపల్ ఔట్ సోర్సింగ్ కార్మికులు

ఉద్యోగ భద్రత కల్పించాలి

మంథని, జూన్18: ఉద్యోగ భద్రత కల్పించాలని మున్సిపల్ కార్యాలయంలో చైర్ పర్సన్ పెండ్రు రమకు ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు మంగళవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మేజర్ గ్రామపంచాయతీ నుంచి మంథని మున్సిపాలిటీగా మారిన తరువాత కూడా విధులు నిర్వహిస్తున్నామని వారు తెలిపారు. నేటి దాకా తమకు ఉద్యోగ భద్రత లేదని, సరైన వేతనం అందక ఇబ్బందులకు గురవుతున్నామని వాపోయారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేసేందుకు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని చైర్ పర్సన్‌ను కోరారు.

గోదావరిఖని : ప్రాక్టికల్ పరీక్షను పరిశీలిస్తున్న జీఎం చింతల శ్రీనివాస్

ఈపీ ఆపరేటర్ ట్రైనీ డ్రైవింగ్ నైపుణ్య పరీక్షలు ప్రారంభం

గోదావరిఖని, జూన్ 18: సింగరేణి ఆర్జీ–1 పరిధి ఉద్యోగుల అంతర్గత ఈపీ ఆపరేటర్ల ట్రైనింగ్ ప్రాక్టికల్ పరీక్షల శిక్షణను ఆర్జీ–1 జీఎం చింతల శ్రీనివాస్ గోదావరిఖనిలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో మంగళవారం జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ ఈ నెల 18 నుంచి 20 వరకు జరిగే ఈపీ ఆపరేటర్ల డ్రైవింగ్ పరీక్ష కంపెనీ వ్యాప్తంగా 1,705 మంది దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. రామగుండం ఆర్జీ–1 పరిధిలో 330 మంది ఉద్యోగులు దరఖాస్తు చేసుకున్నట్లు వివరించారు. ఈ పరీక్షలో ఉత్తీర్ణులైన ఉద్యోగులకు ఈ నెల 30న సింగరేణి కాలరీస్ మహిళా డిగ్రీ, పీజీ కళాశాల కొత్తగూడెంలో రాతపరీక్ష ఉంటుందన్నారు. ఈ పరీక్షలు పూర్తిస్థాయిలో పారదర్శకంగా పిన్ టూ పిన్ కంటిన్యూ వీడియో షూట్ చేస్తూ అభ్యర్థులను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. ఇక్కడ ఆర్జీ–1 ఎస్‌వోటూ జీఎం రామోహ్మన్, ఏజీఎం పర్సనల్ సీహెచ్ లక్ష్మీనారాయణ, పర్సనల్ మేనేజర్(కార్పొరేట్) ప్రకాశ్, ఏజీఎం ఐఈడి ఆంజనేయులు, పర్సనల్ మేనేజర్ కిరణ్‌బాబు, టీటీసీ వెంకటరమణ, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ సారంగపాణి, శ్రావణ్‌కుమార్, హన్మంతరావు, దుర్గప్రసాద్, ఇక్బాల్ షరీఫ్ ఉన్నారు.

రామగిరి, జూన్ 18: సింగరేణి ఆర్జీ–3 ఏరియాలో ఈపీ ఆపరేటర్ ట్రైనీ (కేటగిరి–5) ఉద్యోగ నియామకాలకు సంబంధించి అభ్యర్థులకు స్థానిక రాణీరుద్రమదేవి స్టేడియంలో ప్రాక్టికల్ పరీక్షలను ఆర్జీ–3 జీఎం సుధాకర్ రావు ప్రారంభించారు. అనంతరం పరీక్ష విధానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడారు. మూడు రోజుల పాటు ఆర్జీ–2,3, ఏపీఏ ఏరియాల అభ్యర్థులకు డ్రైవింగ్ నైపుణ్య ప్రాక్టికల్ పరీక్షలను పారదర్శకంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. అభ్యర్థులు పరీక్షలకు నిర్దేశిత సమయంలో హాజరై తమ ప్రతిభ చూపి అర్హత సాధించాలన్నారు. అర్హత సాధించిన వారు ఈనెల 30న జరిగే రాత పరీక్షకు హాజరు కావల్సి ఉంటుందన్నారు. కమిటీ చైర్మన్ రఘుపతి, పర్సనల్ డీజీఎం విలాస్ శ్రీనివాస్, ఏరియా ఇంజినీర్ శ్రీనివాస్, డీజీఎం చంద్రశేఖర్, పీఎం రవీందర్ రెడ్డి, ఎస్ఓట లక్ష్మీనారాయణ, అధికారులు మారుతి, శ్రీహరి, సునీల్ ప్రసాద్, వేణుగోపాల్, రాజేశం, సత్యనారాయణ ఉన్నారు.

కీలక పోస్టులన్నీ ఖాళీయే

- అస్తవ్యస్తంగా మంథని మున్సిపల్ పాలన
- ఇన్‌చార్జీలు, డిప్యూటేషన్ల పైనే విధులు

మంథని మున్సిపల్ కార్యాలయం

మంథని, జూన్ 18: మంథని మున్సిపాలిటీలో కీలక అధికారుల పోస్టులన్నీ ఖాళీగా ఉండడంతో సామాన్యులకు పురపాలక సేవలందక ఇబ్బందులు పడతున్నారు. మేజర్ పంచాయతీగా ఉన్న మంథనిని 2018 ఆగస్టు 2న అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చేసింది. మేజర్ పంచాయతీగా ఉన్న సమయంలో 18వార్డులుండగా, 13వార్డులతో మంథనిని మున్సిపాలిటీగా ఏర్పాటు చేశారు. నియోజకవర్గ కేంద్రంగా ఉన్న మంథనిని మరింత అభివృద్ధి చేసేందుకు, ప్రజలకు మెరుగైన సేవలందించాలనే సదుద్దేశంతో ఏర్పాటు చేసిన మున్సిపాలిటీలో కీలక బాధ్యతలు నిర్వహించే అధికారులు ఎవరూ లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో మంథని మున్సిపాలిటీలో వేగవంతంగా జరగాల్సిన ప్రజా అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు నీరు గారి పోతున్నాయనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. మున్సిపల్ కార్యాలయంలో ఇన్‌చార్జీలు, డిప్యూటేషన్లపై ఉన్న అధికారులు చుట్టపు చూపుగా ఎప్పుడో ఒకసారి వచ్చి తూతూ మంత్రంగా విధులు నిర్వహిస్తున్నారు. వార్డుల్లో అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు, ఆఫీస్‌లో పరిపాలన విభాగంపై పట్టింపు కరువైంది. కార్యాలయంలో పని చేసే కింది స్థాయి ఉద్యోగులు సైతం ఇష్టానుసారంగా విధులు నిర్వహిస్తూ తమను అన్ని రకాలుగా చూసుకునే వారి పనులను చక చకా చేస్తూ వివిధ పనుల నిమిత్తం వచ్చే సామాన్యులతో మాత్రం సరిగ్గా వ్యవహరించకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్దామన్నా వారంతా ఇన్‌చార్జీలు, డిప్యూటేషన్లపై వచ్చిన వారే కావడంతో అందుబాటులో ఉండడం లేదని, కనీసం ఫోన్లో అయినా ఫిర్యాదు చేద్దామనుకున్నా కాల్స్ ఎత్తడం లేదని పలువురు బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కార్యాలయంలో ఖాళీలు ఇవే..

మంథని మున్సిపాలిటీలో ప్రధానంగా మున్సిపల్ కమిషనర్, మేనేజర్, అకౌంటెంట్, టీపీవో, శానిటరీ ఇన్‌స్పెక్టర్ పోస్టులన్నీ ఖాళీగానే ఉన్నాయి. ప్రస్తుతం మంథని కమిషనర్‌గా వ్యవహరిస్తున్న మేనేజర్ గుట్టల మలికార్జునస్వామి ఎఫ్ఏసీ కమిషనర్‌గా ఇటీవల బదిలీపై వచ్చారు. మంచిర్యాల జిల్లాలో పలు మున్సిపాలిటీలకు టీపీవోగా వ్యవహరిస్తున్న ఉద్యోగే మంథని ఇన్‌ఛార్జి టీపీవో, రామగుండం మున్సిపల్ అకౌంటెంట్ మంథనిలో ఇన్‌ఛార్జిగా వ్యవహరిస్తున్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ పోస్టు ఖాళీగానే ఉంది. రెగ్యులర్ టీపీవో లేని కారణంగా అక్రమ నిర్మాణాలు, సెట్ బ్యాక్ తీసుకోకుండా భవనాలు నిర్మిస్తున్నారనే ఆరోపణలున్నాయి. రెండు నెలల క్రితం మంథని పట్టణంలో పలు భవనాలు సెట్ బ్యాక్ లేకుండా నిర్మించారని ఏకంగా మున్సిపల్ అధికారులు కోర్టు అనుమతితో పోలీసుల బందోబస్తు నడుమ కూల్చి వేసిన సంఘటనలు సైతం ఉన్నాయి. ఇటీవల ప్రభుత్వం నియమించిన వార్డు ఆఫీసర్లతో 13వార్డుల్లో శానిటరీ విధులు నిర్వహిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా, మున్సిపల్ ఉన్నతాధికారులు స్పందించి మున్సిపల్ కార్యాలయంలో ఖాళీగా ఉన్న కీలక అధికారుల పోస్టులను భర్తీ చేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

మాట్లాడుతున్న ఎంఈవో రాజయ్య

ప్రతి విద్యార్థికి మాత్రలు అందించాలి

పాలకుర్తి, జూన్18: ప్రతి విద్యార్థికి నట్టల నివారణ మాత్రలు అందజేయాలని ఎంఈవో రాజయ్య పేర్కొన్నారు. బసంత్‌నగర్ ఉన్నతపాఠశాలలో పుట్నూర్, బసంత్‌నగర్ ఆరోగ్యసిబ్బంది, పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో కలిసి సంయుక్తంగా నట్టలనివారణ మందు పంపిణీపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈనెల 20న మండలంలోని అన్ని పాఠశాలల్లో నట్టల నివారణ మాత్రలు పిల్లలకు వేయాలని కోరారు. ప్రభుత్వం ప్రకటించినట్లుగా ఆరోగ్యసిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశ కార్యర్తలు సంయుక్తంగా మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు నట్టల నివారణ మాత్రలు తప్పకుండా వేయించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు సాయిసూర్య, హరితభవని, కాంప్లెక్స్ హెచ్ఎం. గాయత్రీ దేవి, ఉపాధ్యాయులు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ఒరిగిన విద్యుత్ స్తంభం.. పొంచి ఉన్న ప్రమాదం

పొలంలో వంగిన విద్యుత్ స్తంభం

ముత్తారం, జూన్ 18: మండలంలోని పారుపల్లి జీపీ పరిధిలోని శాత్రాజుపల్లి అనుబంధ గ్రామం బండారి రవికి చెందిన పంట పొలంలో 11 కేవీ విద్యుత్ స్తంభం ఒకవైపు ఒరిగింది. కొద్దిరోజులుగా వీస్తున్న ఈదురు గాలుల కారణంగా విద్యుత్ స్తంభం మరింత ఒరిగింది. దీంతో ఆ రైతు ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయాందోళన వ్యక్తం చేస్తున్నాడు. 20 రోజుల నుంచి పరిస్థితి ఇదే విధంగా ఉందని, దీనిపై తాను అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని రైతు బండారు రవి ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ స్తంభం నేలకొరిగి ప్రమాదం జరుగక ముందే సంబంధిత శాఖ అధికారులు స్పందించి, స్తంభాన్ని పునరుద్ధరించాలని సదరు రైతు కోరుతున్నాడు.

కలెక్టర్‌కు శుభాకాంక్షల వెల్లువ

కలెక్టర్‌కు పూలమొక్క అందజేస్తున్న అదనపు కలెక్టర్ అరుణశ్రీ

పెద్దపల్లి, జూన్18: జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షకు శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. సమీకృత కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో కలెక్టర్‌ను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే అరుణశ్రీ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పూలమొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే పలువురు జిల్లా అధికారులు, రాజకీయ నాయకులు కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందించి విషెస్ చెప్పారు.

పారిశుధ్య పనులపై దృష్టి సారించాలి

వాటర్ ప్లాంట్‌లో నీటిని పరిశీలిస్తున్న డీపీవో ఆశాలత

పెద్దపల్లిరూరల్, జూన్ 18: గ్రామాల్లో పారిశుధ్య పనులపై పంచాయతీ అధికారులు దృష్టి సారించాలని, తాగునీటి విషయంలో ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి ఆశాలత సూచించారు. మండలంలోని గౌరెడ్డిపేటలో ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారన్న ఫిర్యాదుల నేపథ్యంలో మంగళవారం గ్రామంలో పర్యటించారు. అధికారులతో కలిసి సందర్శించిన ప్రతీ వీధిలో తిరుగుతూ వివరాలు సేకరించారు. వాటర్ ప్లాంట్‌ను పరిశీలించి తాగునీరు కలుషితం అవుతున్న విషయాన్ని గుర్తించి, సీజ్ చేశారు. కార్యక్రమంలో ఎంపీవో సుదర్శన్, శ్రీనివాస్ సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

చిన్నారులకు పుస్తకాలు పంపిణీ

జ్యోతినగర్, జూన్ 18: రామగుండం రైల్వేస్టేషన్ రహమత్ నగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం గోదావరిఖనికి చెందిన త్రిశక్తి మాతా స్వచ్ఛంద సేవా సంస్థ చిన్నారులకు పుస్తకాలు, పలుకలు, పెన్నులు, పెన్సిళ్లు పంపిణీ చేశారు. 20వ డివిజన్ కార్పొరేటర్ కన్నూరి సతీశ్‌కుమార్ చిన్నారులకు ఈ విద్య బోధన సామగ్రిని అందజేశారు. ఇక్కడ సేవా సంస్థ ప్రతినిధులు తూడి శ్రావణ్‌కుమార్, దాముక పవన్, సందుపట్ల వెంకటేశ్, మీసాల కృష్ణ, ముచ్చకుర్తి రమేశ్, గానగోని శ్రీనివాస్, ముజ్జిగ నర్సయ్య, శ్రీకాంత్, సనంగుల శ్రీనివాస్, కుమారస్వామి, అంగన్‌వాడీ టీచర్ గుర్రాల శ్రీదేవి ఉన్నారు.

గనుల వేలాన్ని అడ్డుకోవాలి

మాట్లాడుతున్న ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్

గోదావరిఖని, జూన్ 18: తెలంగాణలో బొగ్గు బ్లాక్‌లను కేంద్ర ప్రభుత్వం వేలం వేయకుండా రాష్ట్ర ప్రభుత్వం అడ్డుకోవాలని ఏఐటీయూసీ ప్రధానకార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం జీడీకే ఓసీపీ5లో జరిగిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. సింగరేణిని ప్రైవేటీకరణ చేయమని చెప్పిన కేంద్ర మంత్రి గనులను వేలం వేస్తామని ప్రకటన చేయడం రాష్ట్ర ప్రజలను, సింగరేణి కార్మికులను మోసం చేయడమేనని విమర్శించారు. గనుల వేలాన్ని రాష్ట్ర ప్రభుత్వం అడ్డుకోని సింగరేణికి దక్కే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అందుకు రాష్ట్ర ప్రభుత్వంతో కోల్‌బెల్ట్ ప్రాంత ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు కేంద్రంపై ఒత్తిడి తేవాలన్నారు. సింగరేణిలో ఏఐటీయూసీ కార్మికుల పక్షాన ఎల్లప్పుడు అండగా నిలుస్తున్నదన్నారు. ఇక్కడ ఏఐటీయూసీ ప్రాజెక్టు కార్యదర్శి గుర్రం ప్రభుదాస్, నాయకులు రంగు శ్రీనివాస్, మాదవ మహేశ్, గండి ప్రసాద్, బోగ సతీశ్‌బాబు, బలుసు రవి, చంద తిరుపతి, సత్యనారాయణ, చీకటి అంజయ్య, భక్తి శ్రీనివాస్, పెద్దల్లి శంకర్, బండి మల్లేశ్, అంజయ్య, ఏవీఎస్ ప్రకాశ్ ఉన్నారు.

చర్యలు తీసుకోవాలని వినతి

పెద్దపల్లి టౌన్, జూన్ 18: అధిక ధరలకు ఎరువులు, విత్తనాలు విక్రయిస్తున్న దుకాణాల నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని సీపీఎం పెద్దపల్లి ఏరియా కార్యదర్శి సీపెల్లి రవీందర్ మంగళవారం కలెక్టరేట్‌లో ఏవోకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. విత్తన దుకాణాదారులు లాభార్జనే ధ్యేయంగా ఎరువులు, విత్తనాలను బ్లాక్ చేసి అధిక ధరలకు అమ్ముతున్నారని, నకిలీ విత్తనాలను విక్రయిస్తూ రైతులను మోసం చేస్తున్నారని పేర్కొన్నారు. వారిపై చర్యలు తీసుకోవా లని విన్నవించారు. ఇక్కడ నాయకులు కల్లెపల్లి అశోక్, జిల్లాల ప్రశాంత్, రాంచరణ్, నవీన్ ఉన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED
EDUCATION
★ రెగ్యులర్ & డిస్టెన్స్ అడ్మిషన్స్: డిగ్రీ, PG, B.Tech., Diploma, D-ఫార్మసీ, B-ఫార్మసీ, D.Ed., B.Ed., B.P.Ed., MBA, MCA, B.Sc (Agri), B.Sc (నర్సింగ్), GNM. *4 నెలల్లో పరీక్షలు. 8866977112, 339.
NT-333727

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 91827 77571
91827 77194

పంచాయతీ కార్యదర్శికి సమస్యను వివరిస్తున్న మహిళలు

'ఈ నీళ్లు మాకొద్దు'

- పంచాయతీ కార్యదర్శికి ముత్తారం మహిళల వినతి

ముత్తారం, జూన్ 18: మిషన్ భగీరథ నీళ్లు మాకొద్దంటూ ముత్తారం గ్రామానికి చెందిన మహిళలు స్థానిక పంచాయతీ కార్యదర్శికి విన్నవించారు. మిషన్ భగీరథ ద్వారా ముత్తారం పంచాయతీలో సరఫరా చేస్తున్న తాగు నీరు దుర్వాసన, మురికిగా వస్తున్నదని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో మానేరు నుంచి మంచినీటిని సరఫరా చేశారని పేర్కొన్నారు. అదే విధానాన్ని కొనసాగించాలని పంచాయతీ కార్యదర్శి సంతోష్‌ను కోరారు. మురికిగా, దుర్వాసన వస్తున్న నీరు తాగడంతో అనారోగ్యానికి గురవుతున్నామని, తమ సమస్యలను వెంటనే ఉన్నత అధికారులకు తెలిపి పరిష్కరించాలని మహిళలు విజ్ఞప్తి చేశారు.

లీజును ఉపసంహరించుకోవాలి

ఫర్టిలైజర్‌సిటీ, జూన్ 18: విద్యాశాఖ నిబంధనలను ఉల్లంఘిస్తున్న గోదావరిఖనిలోని సెక్రడ్ హార్ట్ హైస్కూల్‌కు సింగరేణి సంస్థ ఇచ్చిన స్థలం లీజును ఉపసంహరించుకోవాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు యాసర్ల రాజ్‌కుమార్ కోరారు. రామగుండం పారిశ్రామిక ప్రాంతంలోని సింగరేణి, కార్మిక, కార్మికేతర పిల్లలకు తక్కువ ఫీజులతో నాణ్యమైన విద్యను అందించాలని కోట్లాది రూపాయల ఖరీదుచేసే స్థలాన్ని అతి తక్కువ ధరకు సింగరేణి స్కూల్ స్థాపనకు స్థలం లీజుకు ఇచ్చినట్లు పేర్కొన్నారు. నాటి నుంచి నేటి వరకు క్రిస్టియన్ మిషనరీ స్కూల్ ముసుగులో విద్యా దోపిడీ జరుగుతోందని ఆరోపించారు. పాఠశాలలో తల్లిదండ్రుల కమిటీని సంప్రదించకుండానే ప్రతి ఏడాది అదనంగా 20–40శాతం ఫీజులను పెంచుతున్నారన్నారు. ప్రశ్నించిన తల్లిదండ్రులు, స్థోమత లేని వారిని పాఠశాలకు పంపించకండని బెదిరింపులకు పాల్పడతున్నట్లు ఆరోపించారు. ప్రభుత్వ నిబంధల ప్రకారం ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యం 25శాతం సామాన్య మధ్యతరగతి కుటుంబాలకు ఉచిత విద్య, ఫీజులో రాయితీ ఇవ్వాల్సి ఉండగా సెక్రడ్ హార్ట్ స్కూల్ నిబంధనలను పాటించడం లేదన్నారు. విద్యార్థుల నోట్, టెక్స్‌బుక్స్‌ను కూడా వారు సూచించిన బుక్‌స్టాల్‌లోనే కొనుగోలు చేయాలని నిబంధనలు పెడుతున్నట్లు ఆరోపించారు. మిషనరీ స్కూల్ ద్వారా అవినీతి అక్రమాలకు పాల్పడుతున్న ఈ స్కూల్ లీజును సింగరేణి ఉపసంహరించుకోవాలన్నారు. ఇదే స్థలంలో సింగరేణి సంస్థ తరుపున పాఠశాలను ఏర్పాటు చేసి తక్కువ ఫీజుతో విద్యను అందించాలని ఆయన యాజమాన్యాన్ని ఒక ప్రకటనలో కోరారు.

కొలనూర్‌లో యువకుడి ఆత్మహత్య

వినోద్‌కుమార్(ఫైల్)

ఓదెల, జూన్18: కొలనూర్ గ్రామానికి చెందిన దున్నపోతుల వినోద్‌కుమార్(32) స్థానిక రైల్వేగేట్ దగ్గరలో దక్షిణ్ ఎక్స్‌ప్రెస్ కిందపడి ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. కుటుంబ సభ్యులు మానసిక ఇబ్బందులకు గురి చేయడంతో మనస్తాపానికి గురై రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నట్లు తల్లి స్వరూప ఫిర్యాదు చేశారని రామగుండం రైల్వే హెడ్ కానిస్టేబుల్ తిరుపతి తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని వినతి

పెద్దపల్లి/పెద్దపల్లి టౌన్, జూన్18: మోడల్ గర్ల్స్ హాస్టల్ సిబ్బందిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే అరుణ శ్రీకి మంగళవారం వినతి పత్రం అందించారు. మోడల్ స్కూల్ గర్ల్స్ హాస్టల్‌లో విధులు నిర్వహిస్తున్న కేర్ టేకర్, ఏఎన్ఎం, హెడ్ కుక్, అసిస్టెంట్ కుక్, వాచ్‌మెన్‌తో పాటు వివిధ విభాగాల్లో పనిచేస్తున్న వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా జనరల్ సెక్రటరీ కడారి సునీల్ మాట్లాడారు. మోడల్ గర్ల్స్ హాస్టల్ సిబ్బందిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, పని గంటలు తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈపీఎఫ్ ఈఎస్ఐ, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. పెండింగ్ వేతనాలు విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో తిరుమల, ధనలక్ష్మి, గీత, మహిత, దేవమ్మ, రజిత, భారతి, వసంత, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు

పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఉపాధ్యాయులు

కటికనపల్లి పాఠశాలకు పుస్తకాలు విరాళం

ధర్మారం, జూన్ 18: కటికనపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థుల కోసం కరీంనగర్‌కు చెందిన ఎన్ఆర్ఐ ముక్కా నవీన్ రూ. 11 వేల విలువైన నోటు పుస్తకాలను విరాళంగా అందించారు. పుస్తకాల కోసం హెచ్ఎం సురుకంటి ప్రభాకర్ రెడ్డి తన మిత్రుడు ఎన్ఆర్ఐ నవీన్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన వెంటనే స్పందించారు. మంగళవారం ఉదయం పాఠశాల కాంప్లెక్స్ హెచ్ఎం మల్లేశం పంపిణీ చేశారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్ పర్సన్ భాగ్యలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కామాంధుడిని శిక్షించాలి

రామగిరి, జూన్ 18: సుల్తానాబాద్ మండలం కాట్నపల్లిలో బాలికపై అత్యాచారం, హత్య చేసిన కామాంధుడిని కఠినంగా శిక్షించాలని రత్నాపూర్ మాజీ సర్పంచ్ పల్లె ప్రతిమ పీవీ రావు డిమాండ్ చేశారు. కామాంధుడికి ప్రజా కోర్టులో మరణ శిక్ష విధించాలన్నారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం రూ.50లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా రైస్‌మిల్లుల్లో పనులకు వచ్చే వలస కూలీలను ఇక్కడ నుంచి పంపించాలన్నారు.

సమగ్ర పిల్లల సర్వే

పెద్దపల్లి, జూన్18: పెద్దపల్లి మున్సిపల్ పరిధిలో 16 ఏళ్లలోపు పిల్లల సమగ్ర సర్వే మంగళవారం ప్రారంభించారు. మున్సిపల్ ఆర్పీలు, ప్రభుత్వ ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు 36వ వార్డులో ఇంటింటికీ వెళ్లి పిల్లల వివరాలు సేకరించారు. పిల్లల కుటుంబ వివరాలతో పాటు అసలు పాఠశాలకు వెళుతున్నారా? లేదా? ప్రభుత్వ పాఠశాలలు, ప్రైవేట్ పాఠశాలలకు వెళ్లే పిల్లల వివరాలతో పాటు, పాఠశాలకు వెళ్లని వారి వివరాలు కూడా సేకరిస్తున్నారు. శనివారం వరకు సర్వే పూర్తి చేసి ఎడ్యుకేషన్ రిజిస్టర్ రూపొందించనున్నట్లు ఎంఈవో సురేందర్ కుమార్ తెలిపారు. పెద్దపల్లి క్లస్టర్ సీఆర్పీ బాల సాని వెంకటేశం పాల్గొన్నారు.

'బడిబాట' పై కళాజాత

ముత్తారం, జూన్ 18: మండల కేంద్రంలో తెలంగాణ సాంస్కృతిక సారథి కళా బృందంతో బడిబాట కార్యక్రమంపై కళాజాత నిర్వహించారు. తల్లిదండ్రులు విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలో ఉచితంగా పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్స్, ఇంగ్లిష్ మీడియం విద్యాబోధన, మధ్యాహ్నం భోజన సౌకర్యాలు ఉన్నాయని గ్రామస్తులకు పాటల రూపంలో అవగాహన కల్పించారు. ఇక్కడ సాంస్కృతిక సారథి కళాకారులు కోండ్ర వెంకన్న గౌడ్, ఇల్లందుల మల్లేష్ గౌడ్, జనగామ రాజనర్సు, ఈదునూరి పద్మ, బుర్ర శంకర్ గౌడ్, సలేంద్ర రాజన్న, దీకొండ శ్రావణ్, కట్కూరి శ్రీవల్లి, జిన్న రమ, కన్నూరి రేణుక పాల్గొన్నారు.

కార్గో సేవలు ప్రారంభం

కార్గోసేవలను ప్రారంభిస్తున్న ఆర్టీసీ అధికారులు

ఓదెల, జూన్18: పొత్కపల్లి లో ఆర్టీసీ ఆధ్వర్యంలో మంగళవారం కార్గో సేవలను కరీంనగర్ మేనేజర్ సదాశివ ప్రారంభించారు. ఇక్కడి ప్రాంత ప్రజలు, వ్యాపారులు, ప్రయాణికుల సౌకర్యార్థం కార్గో సేవలు ప్రారంభించినట్లు తెలిపారు. ఇక్కడి ప్రాంత ప్రజలు కార్గో సేవలను వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏజెంట్ బొంగోని వెంకటేశ్, రమేశ్, శ్రీనివాస్, కొమురయ్య, మహేశ్, రాజేశ్, వినయ్, సాయి పాల్గొన్నారు. వివరాలకు ఏజెంట్ సెల్ నెం. 7981169996, హుజురాబాద్ డిపో కార్గో ఎగ్జిక్యూటివ్ సెల్ నెం. 9154298559 లో సంప్రదించాలని సూచించారు.

జోగు ఎత్తిన ముదిరాజ్‌లు

జోగు ఎత్తుతున్న ముదిరాజ్‌లు

కమాన్‌పూర్, జూన్ 18: మండలంలోని జూలపల్లిలో మల్లికార్జున నగర్‌లోని ముదిరాజ్ కులస్తులు పెద్దమ్మ తల్లి ఆలయం వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం గ్రామంలో ముదిరాజ్ కులస్తులు ఇంటింటికి తిరుగుతూ జోగు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ముదిరాజ్ కులస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

20 నుంచి ఆల్బెండజోల్ మాత్రలు

విద్యానగర్, జూన్ 18: ఈనెల 20న జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా జిల్లాలో ఉన్న 1 నుంచి 19 ఏళ్లలోపు 3,47,523మంది పిల్లల కోసం 3,48,900 ఆల్బెండజోల్ మాత్రలను అన్ని ప్రాథమిక, పట్టణ ఆరోగ్య కేంద్రాలకు పంపిణీ చేయనున్నట్లు డీఎంహెచ్‌వో మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కాలేజీల్లో మాత్రలు వేయించాలని కోరారు.